## మూడు వర్సిటీలకు

# కొత్త విసిలు

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో



ఎస్.సత్యనారాయణ

ఉస్మానియా సహా మూడు విశ్వవిద్యాలయాలకు కొత్త వైస్‌ఛాన్సలర్లను రాష్ట్ర గవర్నర్ నరసింహన్ నియమించారు. ఉస్మానియాకు ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ ప్రకాశ్, తెలంగాణా విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ మహ్మద్ అక్బర్ అలీఖాన్ వైఎస్ ఛాన్స్‌లర్లుగా నియమితులయ్యారు ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. విసిల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించిన ఉన్నత విద్యాశాఖ మూడేసి పేర్లతో కూడిన జాబితాలను ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి పంపింది. తరువాత ఆ జాబితాను గవర్నర్‌కు పంపగా విసిల పేర్లను ఖరారు చేశారు. ఉస్మానియా విసి ఎస్.సత్యనారాయణ ప్రస్తుతం రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ సాంకేతిక నాలెడ్జి(ఆర్‌జియుకెటి)కి రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. తెలంగాణా విశ్వవిద్యాలయానికి విసిగా నియమితులైన అక్బర్ అలీఖాన్ ఉస్మానియాలో కామర్స్ విభాగంలో పనిచేస్తున్నారు. డాక్టర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి విసిగా నియమితులైన పి.ప్రకాశ్ ప్రస్తుతం యుజిసిలో అదనపు కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

# ఎట్టకేలకు.. టియుకి పూర్తిస్థాయి విసి

ప్రజాశక్తి - డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్శిటీకి ఎట్టకేలకు పూర్తిస్థాయి వైస్‌ఛాన్సలర్‌ను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ నరసింహన్ శుక్రవారం ప్రకటించారు. టియు పిఆర్‌ఓ ప్రొఫెసర్ రాజారాం తెలిపిన వివరాలప్రకారం... 'ఉస్మానియా యూనివర్సిటీలో కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ మహ్మద్ అక్బర్‌అలీఖాన్‌ను తెలంగాణ యూనివర్సిటీకి వైస్‌ఛాన్స్‌లర్‌గా నియమించారు. అక్బర్‌అలీఖాన్ కరీంనగర్‌కు చెందిన వారు. 30ఏళ్లుగా ఆయన ఓయులో ప్రొఫెసర్‌గా విధులు నిర్వరిస్తున్నారు. ఆయన అపార అనుభవం కలవారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు సైతం హాజరౌతుంటారు ' అని పిఆర్‌ఓ పేర్కొన్నారు. అక్బర్‌అలీఖాన్ కామర్స్‌పై మూడుపుస్తకాలు రాశారని, కామర్స్ విభాగంలో 50పరిశోధన పత్రాలను సమర్పించారని పేర్కొన్నారు. 'పదో తరగతి వరకూ కరీంనగర్‌లో చదువుకున్న ఆయన హైదరాబాద్‌లో ఉన్నతవిద్య, ఔరంగాబాద్‌లో పిహెచ్‌డి చేశారు. గతంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత పదవులు చేపట్టారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, డీన్‌గా విధులు నిర్వహించారు. అలీఖాన్ రెండురోజుల్లో తెలంగాణ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు' అని వివరించారు. సుమారు 20 నెలల అనంతరం పూర్తిస్థాయి విసి నియమించడం పట్ల విద్యార్థులు, విద్యార్థిసంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విసి నియామకంతో అభివృద్ధి జరిగేనా

తెలంగాణ యూనివర్సిటీ విసిగా ఉన్న కాశీరాం 20నెలల క్రితం పదవీ విరమణ పొందడంతో ఇప్పటివరకూ ఇన్‌ఛార్జి విసిలతో నెట్టుకొచ్చారు. సరైన పాలన లేకపోవడంతో యూనివర్సిటీకి యుజిసి గుర్తింపు రాలేకపోయింది. తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిపోయింది. యూనివర్సిటీలో ఉన్న కోర్సులను సైతం భిక్కనూరు క్యాంపస్‌కు తరలించారు. దీంతో విద్యార్థులు ఆందోళనలు చేశారు. కళాశాలలో ఎన్నో కోర్సులకు గదుల కొరత ఉంది. వసతిగృహాలు నిర్మాణానికి నోచుకోలేదు. నేడు గవర్నర్ పూర్తిస్థాయి విసిని నియమించడంతో విద్యార్థి సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విసి హయాంలోనైనా యూనివర్సిటీ అభివృద్ధి బాటలో నడవాలని కోరుతున్నారు.